సాక్షి
ఖమ్మం

శనివారం । 7 । డిసెంబర్ । 2024



పెద్దాస్పత్రిలో ఎక్స్‌రే పాట్లు

జిల్లా పెద్దాస్పత్రిలోని ఎక్స్‌రే మిషన్ మరమ్మతుకు రావడంతో అవసరమైన వారు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది.

8లో



గొంతు నొక్కుతున్నారు..

అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రభుత్వం తమ పార్టీ నేతల గొంతు నొక్కుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు ఆరోపించారు.

8లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఉదయం మంచు ప్రభావం, రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి అవినీతి రహిత సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ సూచించారు. అవినీతి నిరోధక వారోత్సవాల సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యాన శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు వద్ద ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. అవినీతికి పాల్పడడం ద్వారా అనేక దుష్పలితాలు ఉంటాయని, ప్రజలకు ఉద్యోగులపై నమ్మకం పోతుందని తెలిపారు.

నాణ్యత ఆధారంగా ధాన్యం కొనుగోళ్లు



ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న డీసీఓ

కారేపల్లి/ముదిగొండ: నిర్దేశిత తేమ శాతం ఉన్న వరి ధాన్యం తీసుకొస్తే కొనుగోళ్లు సాఫీగా సాగుతాయని జిల్లా సహకార అధికారి గంగాధర్ తెలిపారు. ఈమేరకు రైతులు ధాన్యం ఆరబోసి, తూర్పార బట్టి తీసుకురావాలని సూచించారు. కారేపల్లి మండలం విశ్వనాథపల్లి, ముదిగొండ మండలం మేడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీసీఓ మాట్లాడుతూ ధాన్యం కాంటా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే రైతుల ఖాతాలో మద్దతు ధరతో పాటు సన్నరకాలకు రూ.500 జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విశ్వనాథపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సొసైటీ సీఈఓలు బొల్లు హన్మంతరావు, శ్రీనివాసరావు, ఎంఈఓ జయరాజు, హెచ్‌ఎం పద్మావతి, ఏఈఓ మౌనికతో పాటు ఉద్యోగి ఎస్.కే.యాకూబ్ పాషా, రైతులు పాల్గొన్నారు.

హైరిస్క్ బాధితులను నిరంతరం పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం/కూసుమంచి: హెచ్‌ఐవీ నివారణలో భాగంగా హైరిస్క్ ప్రవర్తన కలిగిన వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి సూచించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు పనిచేస్తున్న జాగృతి, జనవాణి స్వచ్ఛంద సేవా సంస్థలు, వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ సంస్థ బాధ్యులు శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. హెచ్‌ఐవీ బారిన పడి హైరిస్క్ ప్రవర్తన కలిగి వారికి మెరుగైన చికిత్స అందిస్తే జీవితకాలాన్ని పొడిగించొచ్చని తెలిపారు. అలాగే, ఖమ్మంను ఎయిడ్స్ రహితంగా మార్చేందుకు సహకరించాలని సూచించారు. అదనపు డీఎంహెచ్‌ఓ పి.వెంకటరమణ మాట్లాడగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సైదులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.రామారావు, డెమో సాంబశివారెడ్డితోపాటు ఉద్యోగులు సత్యకుమార్, నాగయ్య, మహమూద్ అలీ, వీరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు. కాగా, కూసుమంచిలోని పీహెచ్‌సీ తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ కళావతిబాయి.. అక్కడి ఉద్యోగుల నడుమ విభేదాలపై అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్యాకేజీ-13 పనులకు ఆరు టెండర్లు

ఖమ్మంఅర్బన్: సీతారామ ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ-13లో సుమారు రూ.200 కోట్ల అంచనాలతో చేపట్టే పనులకు దాఖలైన టెండర్లను శుక్రవారం పరిశీలించారు. జలవనరుల శాఖ అధికారులు కొద్దిరోజుల క్రితం టెండర్లు ఆహ్వానించగా ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అధికారులు తెరిచారు. ఈమేరకు ఆరు కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. వీటిని పరిశీలించి తక్కువకు కోట్ చేసిన కంపెనీకి అర్హతల ఆధారంగా పనులు అప్పగించే అవకాశముంది. ఇదంతా పూర్తవడానికి పది రోజులు పడుతుందని అధికారులు వెల్లడించారు.

యాసంగి సాగుకు సన్నద్ధం



కామేపల్లిలో వరి నారుమడి సంరక్షణపై సూచనలు చేస్తున్న ఏఓ తార, తదితరులు

- జిల్లాలో 3,16,446 ఎకరాల్లో పంటల సాగు ప్రణాళిక
- సాగర్ సహా జలాశయాల్లో పుష్కలంగా నీరు
- వారబందీ విధానంలో విడుదలకు నిర్ణయం
- మద్దతు ధర, బోనస్‌తో సన్న ధాన్యం రకాల సాగుకే రైతుల మొగ్గు
- ఆరుతడి పంటగా సాగు కానున్న మొక్కజొన్న

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో యాసంగి పంటల సాగుకు రైతాంగం సిద్ధమవుతోంది. ఈసారి 3,16,446 ఎకరాల్లో పంటల సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉండడం... మద్దతు ధరకు తోడు బోనస్ చెల్లిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేయనుండగా.. పెసర, వేరుశనగ, మినుము పంటలు కొద్దిమేర సాగయ్యేఅవకాశముంది. ప్రస్తుతం రైతులు దుక్కులు దున్నడంతోపాటు, వరి నారు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసింది.

పుష్కలంగా సాగునీరు

జిల్లాలో యాసంగి సీజన్ పంటల సాగుకు నీటి వనరులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. వానాకాలంలో కురిసిన భారీ వర్షాలతో చేరిన నీటితో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. పాలేరు, వైరా రిజర్వాయర్లతోపాటు బేతుపల్లి చెరువులు కళకళలాడుతుండగా చెరువులు, చిన్న తరహా ప్రాజెక్టుల్లో కూడా సరిపడా నీరు ఉంది. యాసంగి సాగు దృష్ట్యా ఈనెల 10 నుంచి నాగార్జునసాగర్ జలాలను వారబందీ విధానంలో విడుదల చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని 17 మండలాల్లో ఉన్న 2.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ జలాలు అందనుండగా.. బోర్లు, బావుల కింద కూడా వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

వరి.. 2.14 లక్షల ఎకరాల్లో

ఈ యాసంగిలో 2,14,892 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తం యాసంగి సాగులో ఇది 68 శాతం కావడం గమనార్హం. అయితే, పంటల చివరి దశలో నీటి ఇక్కట్లు ఎదురుకాకుండా ఆరుతడి పంటలే సాగు చేయాలని అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కానీ వానాకాలంలో సాగు చేసిన సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ అందడంతో యాసంగిలోనూ రైతులు ఇవే రకాల సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసుకుంటుండగా జనవరి నాటికి నాట్లు వేసే అవకాశముంది.

మొక్కజొన్న కూడా..

ఏటా యాసంగిలో రైతులు మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యత ఇస్తారు. అదేతరహాలో ఈసారి కూడా వరి తర్వాత 91,227 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారని అంచనా. మూడు నుంచి నాలుగు తడులతో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేసే అవకాశం ఉండడం.. గతంలో క్వింటాకు రూ.2వేలకు పైగా ధర రావడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వానాకాలంలో పత్తి సాగు చేసిన రైతులు పంట తొలగించాక ఇప్పటికే మొక్కజొన్న విత్తుతున్నారు. ఆ తర్వాత స్థానంలో పెసర, వేరుశనగ, మినుము పంటలు సాగు చేసే అవకాశముంది.

ఎరువులు, విత్తనాలు సిద్ధం

యాసంగిలో పంటల సాగు అంచనాలు రూపొందించిన అధికారులు ఎరువులను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రధానంగా యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎస్‌ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులు కలిపి ప్రస్తుతం 1,15,851 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి. ఇక తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వరితోపాటు పెసర, మినుము, వేరుశనగ తదితర విత్తనాల అమ్మకానికి సిద్ధమవుతోంది. విత్తనాలను పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, డీలర్ల ద్వారా విక్రయించనున్నారు. కాగా, యాసంగిలో తక్కువ సమయాన చేతికొచ్చే మూడు రకాల వరి విత్తనాలు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు.

జిల్లాలో యాసంగి పంటల సాగు అంచనా

పంట	ఎకరాలు
వరి	2,14,892
మొక్కజొన్న	91,227
పెసర	8,776
వేరుశనగ	744
మినుము	807
మొత్తం	3,16,446

అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలు

ఎరువులు	మెట్రిక్ టన్నులు
యూరియా	25,747
డీఏపీ	15,821
ఎంఓపీ	15,581
ఎస్‌ఎస్‌పీ	30,926
కాంప్లెక్స్	27,776

గృహమస్తు

- 'ఇందిరమ్మ' ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు రంగం సిద్ధం
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా సర్వే
- యాప్‌లో వివరాలు నమోదు చేయనున్న ఉద్యోగులు
- ఆపై గ్రామ, వార్డుసభల్లో జాబితా ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అభయ హస్తం పేరిట మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి నిర్ణయించగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించనున్నారు. ఇప్పటికే ఇంటి నమూనా విడుదల చేయడంతో పాటు లబ్ధిదారుల గుర్తింపు కోసం యాప్ కూడా రూపొందించారు. కాగా, తొలిదశలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వంతాదేశించింది. ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్న ఉద్యోగులు యాప్‌లో పొందుపరుస్తారు. ఆపై గ్రామపంచాయితీ, మున్సిపాలిటీల్లో వార్డుల ఆధారంగా జాబితాను ప్రదర్శించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

నాలుగు దశల్లో రూ.5లక్షలు

ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయనుండగా నాలుగు దశల్లో ఈ నిధులు అందిస్తారు. మొదటి దశగా బేస్‌మెంట్(పునాది), రూఫ్ లెవల్(స్లాబ్ స్థాయి) రూ.లక్ష చొప్పున, స్లాబ్ స్థాయి తర్వాత రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మిగతా రూ.లక్ష ఖాతాలో జమ చేస్తారు.

కార్యదర్శులు, వార్డు అధికారులే క్రియాశీలకం

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో గ్రామపంచాయితీల కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం యాప్ రూపొదించగా.. ఉద్యోగులు దరఖాస్తుల ఆధారంగా వివరాలు సేకరించి అందులో పొందుపర్చాలి. యాప్‌లో వివరాల నమోదుపై అధికారులకు ఇప్పటికే అవగాహన కల్పించగా, వారు గ్రామపంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో క్షేత్ర స్థాయి పరిశీలన మొదలవుతుందని, ఈనెల 20వ తేదీ నాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తవుతుందని తెలుస్తోంది.



ఇందిరమ్మ ఇంటి నమూనా

ఇవీ అర్హతలు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం పలు అర్హతలను నిర్దేశించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారిలో సొంత ఇంటి స్థలం కలిగిన వారిని అర్హులుగా గుర్తిస్తారు. వీరిలో పూరి గుడిసె, మట్టి గోడలు, పెంకు కప్పుతో ఉన్న నిర్మాణాలు, తాటాకు గుడిసెల్లో నివాసం ఉంటున్న వారు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారే కాక ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యత ఇస్తారు. ఇక ఐటీడీఏ పరిధిలో ఆదివాసీలకు ప్రత్యేక కేటాయింపు ఉంటుంది.

దరఖాస్తులు భారీగా...

జిల్లాలో ప్రజాపాలన పేరిట నిర్వహించిన సభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,57,869 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే 53,990 ఉన్నాయి. కానీ ప్రభుత్వం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 చొప్పున జిల్లా మొత్తానికి కేవలం 17,500 ఇళ్లే మంజూరు చేసింది. అంతేకాక ప్రభుత్వం సూచించిన అర్హతల ఆధారంగా చూసినా అర్హుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. కానీ కేటాయింపు తక్కువగా ఉండడంతో మొదటి దశలో ఇళ్లు ఎవరికి కేటాయిస్తారు, లబ్ధిదారుల ఎంపిక ఎలా ఉంటుందోననే చర్చ మొదలైంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో కలెక్టర్ లబ్ధిదారుల జాబితా ఖరారు చేస్తుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అయితే, ఇందిరమ్మ కమిటీలను నియమించగా ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా కొన్నిచోట్ల తెర చాటు వ్యవహారాలు మొదలైనట్లు తెలుస్తోంది.

వ్యవసాయానికి వడ్డీలేని రుణాలు

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌బీఐ
- జిల్లాలో 3.75 లక్షల మందికి ప్రయోజనం



ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ అవసరాలకు వడ్డీ లేని తాకట్టు రుణాలు ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోగా బ్యాంకుల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, సీఈఓలను ఆదేశిస్తూ ఆర్‌బీఐ నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచడమే లక్ష్యంగా ఈ వెసలుబాటు కల్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ రుణాలకూ ఈ విధానం వర్తిస్తుందని కూడా వెల్లడించారు. రూ.1.6 లక్షల నుంచి రూ.2లక్షల వరకు వడ్డీ లేని తాకట్టు రుణాలను వచ్చేనెల 1వ తేదీ నుంచి ఇవ్వాలని సూచించారు. కాగా, ఇప్పటికే సహకార బ్యాంకుల ద్వారా ప్రభుత్వాలు రూ.0.25 పైసల వడ్డీతో పంట రుణాలు ఇస్తున్నాయి. ప్రస్తుతం అన్ని బ్యాంకులు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ఆదేశించడంతో రైతులకు మరింత ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. జిల్లాలో ఏటా 3.75 లక్షల మంది సుమారు రూ.4,250 కోట్ల పంట రుణాలు తీసుకుంటారని గణాంకాలు చెబుతుండగా.. వీరందరికీ వడ్డీ మినహాయింపు లభించనుంది.

యాప్‌పై సంపూర్ణ అవగాహన కల్పించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కలిగేలా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ యాప్, లాగిన్ ఐడీ ఇచ్చినందున తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, మునిసిపల్ కమిషనర్లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 3,57,869 దరఖాస్తులు అందినందున రోజుకు ఒక ఉద్యోగి 40 దరఖాస్తులను పరిశీలించేలా లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

ఖమ్మంక్రైం: పోలీసు శాఖలో సగభాగమైన హోంగార్డుల సేవలు అభినందనీయమని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మంలోని సిటీ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన సమావేశంలో సీపీ సాయుధ హోంగార్డుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల సేవలు మరువలేనివన్నారు. ఇటీవల భారీ వరదల సమయాన వారి ఇళ్లు దెబ్బతిన్నా విధుల్లో నిమగ్నమయ్యారని గుర్తు చేశారు. అంతేకాక తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల బందోబస్తు విధులు సమర్థవంతంగా నిర్వహించిన వారి సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఇటీవల క్రీడాపోటీల్లో విజేతలకు సీపీ బహుమతులు అందజేశారు. అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, కుమారస్వామి, ఏసీపీలు సాంబరాజు, సుశీల్‌సింగ్, నర్సయ్య, హోంగార్డు ఆర్‌ఐలు సురేష్ శ్రీశైలం, అప్పల నాయుడు పాల్గొనగా పరేడ్‌కు వెంకటేశ్వర్లు నేతృత్వం వహించారు.



గౌరవవందనం స్వీకరిస్తున్న సీపీ సునీల్‌దత్, అధికారులు

పల్లె పోరుకు కసరత్తు!

నేడు పోలింగ్ కేంద్రాల ముసాయిదా వెల్లడి

ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికలకు ఒక్కో అడుగు పడుతోంది. ఇప్పటికే జీపీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేశారు. అలాగే, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు ఇటీవల పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించి జాబితా రూపొందించగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఆమోదించారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కేంద్రాలను విడదీసి అవసరమైన చోట్ల కొత్తవి ఏర్పాటుచేయగా, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు కేంద్రాల్లో ఉంటే ఒకే చోటకు చేరుస్తూ ఈ జాబితాలు రూపొందించారు. వీటిని శనివారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. వీటిపై 10వ తేదీన జిల్లాస్థాయిలో, 12న మండలస్థాయిలో అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. మరోపక్క శనివారం నుంచి ఈనెల 12 వరకు కేంద్రాలపై అభ్యంతరాలు స్వీకరించి 13వ తేదీన పరిష్కరించనున్నారు. అనంతరం 17న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. ఇదికాక గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు కావాల్సిన సామగ్రి కూడా జిల్లాలకు చేరుతుండడంతో ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ రావొచ్చనే ప్రచారం జరుగుతోంది.



ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌ను విద్యుత్ లైట్లతో అలంకరించారు. జాతీయ జెండాను పోలిన రంగుల్లోని లైట్ల వెలుతురుతో కళకళలాడుతున్న కలెక్టరేట్‌ను వైరా - ఖమ్మం రహదారిపై వచ్చివెళ్తున్న వారు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. పలువురు వాహనదారులు కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ఆగి ఫొటోలు తీసుకుంటున్నారు. - ఖమ్మంసహకారనగర్

క్లుప్తంగా

చదువుతోనే మహిళా సాధికారత


సదస్సులో మాట్లాడుతున్న జయరాజు

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఉన్నత చదువులతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ప్రజాకవి జయరాజు అన్నారు. వీరనారిమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం రాజ్యాధికారం, మహిళా రిజర్వేషన్ల అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో మహిళలు ఉన్నత చదువు కోసం అడుగు ముందుకు వేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ గ్రీష్మ, ఫరహా, షేక్ నజీమాతో పాటు భూక్యా ఉపేంద్రాబాయి, జ్యోతి తదితరులు మాట్లాడగా వివిధ సంఘాల నాయకులు బానోతు భద్రూనాయక్, రాణి, నాగయ్య, జ్యోతి, జాన్‌బీ, త్రివేణి, చందు, విజయ, లలిత, సుభద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాబ్‌మేళాకు 52 మంది హాజరు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 52మంది హాజరయ్యారు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్టులు, ఇతర ఉద్యోగాలకు ఎంపికకు జాబ్‌మేళా నిర్వహించగా 21మందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. ఆపై వడపోతల అనంతరం 12మందిని అర్హులుగా గుర్తించి నియామక పత్రాలు అందజేశారు. జాబ్ మేళాలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్.మాధవి, ఉద్యోగి శ్రీనివాసరావుతో పాటు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్ల విలువైన ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ల ఏర్పాటు

ఏన్కూరు: మండలంలోని జన్నారం సబ్‌స్టేషన్‌లో అదనంగా రూ.కోటిన్నర విలువైన ట్రాన్స్‌ఫార్మర్, రెండు ఫీడర్లు ఏర్పాటు చేసినట్లు డీఈ ఎల్.రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. లో ఓల్టేజీ సమస్య నివారణకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయగా ఇకపై వ్యవసాయ మోటార్లకు సమస్య తలెత్తదని చెప్పారు. డీఈ భద్రు, ఏడీఈ రమేష్, ఏఈఓ సతీష్, ఏఈ ఉమకాంత్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు మూడు నెలల జీతాలు చెల్లించాలని సీఐటీయూ, టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ చాలీచాలని వేతంతో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అటు కాంట్రాక్టర్, ఇటు అధికారుల తీరుతో సమస్య నెలకొందని, ఇకనైనా జీతాలు చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు వై.విక్రం, కె.శ్రీనివాస్, విజయమ్మ ,వెంకటరమణ, అశోక్, అంబేద్కర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక


గోపి

బోనకల్: ఆలిండి యా బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ కప్ టోర్నీకి ఖమ్మం జిల్లా బోనకల్‌కు చెందిన బి.గోపి ఎంపికయ్యాడు. మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన శిక్షణలో పాల్గొన్న ఆయన ప్రతిభ కనబరచడంతో టోర్నీకి ఎంపిక చేశారు. కర్ణాటకలో జరుగుతున్న పోటీలకు గోపి బయలుదేరాడని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంచందర్ రాజు, శ్రీనివాసరావు, కోచ్ లింగయ్య తెలిపారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

ఖమ్మంక్రైం: పద్మనాయక వెలమ సామాజికవర్గాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వెలమ సంఘం నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఒక ప్రజాప్రతినిధిగా తమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించడమే కాక వెలమ కులస్తుల అంతు చూస్తామని బెదిరించాడని పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాగి వెంకటేశ్వరరావు, సీతారామారావు, నాయకులు వెంకటేశ్వరరావు సురేష్‌బాబు, సురేందర్‌రావు, సుధాకర్‌రావు ఫిర్యాదు అందజేశారు.

జర్నలిస్టుగా చెప్పుకుంటూ ఇసుక దందా

తిరుమలాయపాలెం: మండలంలోని ముజాహిదిపురానికి చెందిన పి.ప్రభాకర్ జర్నలిస్టుగా చెప్పుకుంటూ ఇసుక అక్రమ వ్యాపారం చేస్తుండగా శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆయన జర్నలిస్టునని చెప్పడమే కాక పోలీసులంతా తెలుసునని ట్రాక్టర్ డ్రైవర్లను బెదిరించి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు ప్రభాకర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు.

పెద్దాస్పత్రిలో ఎక్స్‌రే పాట్లు

- నాలుగు రోజులుగా నిలిచిపోయిన సేవలు
- టీ–హబ్‌కు పంపిస్తున్న వైద్యులు
- అక్కడ లోడ్ పెరిగి తరచూ మొరాయిస్తున్న యంత్రం


టీ-హబ్‌లోని ఎక్స్‌రే విభాగం వద్ద వేచి ఉన్న జనం


హబ్‌లో యంత్రం మొరాయించడంతో సరిచేస్తున్న సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: వ్యాధి నిర్ధారణలో ఎక్స్‌రే పాత్ర కీలకం. ప్రమాదాల బారిన పడిన వారే కాక నొప్పులతో బాధపడుతున్న వారికి ఎక్స్‌రే తీశాక నివేదిక ఆధారంగా వైద్యులు చికిత్స చేస్తుంటారు. ఈక్రమాన ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఎక్స్‌రే తీయించుకునేందుకు నిత్యం వందలాది మంది వస్తుండగా ఇక్కడ నిరాశ ఎదురవుతోంది. ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్‌లో సమస్య ఏర్పడడంతో నాలుగు రోజులుగా సేవలు నిలిచిపోయాయి. దీంతో పలువురు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతుండగా.. మరికొందరు మిషన్ ఎప్పుడు బాగవుతుందా అని ప్రతీరోజు ఆస్పత్రికి వచ్చివెళ్తున్నారు.

రోజూ 250 మందికి పైగా..

ఎక్స్‌రే యంత్రం పాడవకముందు నిత్యం 250 నుండి 300 మంది వరకు ఎక్స్‌రే తీసేవారు. ఓపీ సేవలతో పాటు ఇన్‌పేషంట్లకు సైతం ఎక్స్‌రే సేవలు కీలకం కావడంతో 24 గంటల పాటు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. అయితే నాలుగు రోజుల క్రితం ఎక్స్‌రే మిషన్‌లో సమస్య ఏర్పడి సేవలు నిలిచిపోయాయి.

'హబ్'కు వెళ్తే అక్కడా ఇక్కట్లే

జనరల్ ఆస్పత్రిలోని ఎక్స్‌రే మిషన్ సామర్థ్యం పెద్దది. ఈ యంత్రం ద్వారా రోజుకు 300 మందికి ఎక్స్‌రే తీసే సామర్థ్యం ఉంది. కానీ డయోగ్నస్టిక్ హబ్‌లో ఏర్పాటుచేసిన యంత్రానికి అంత సామర్థ్యం లేదు. ఇక్కడ ఎక్స్‌రే మిషన్, మామోగ్రఫీకి లింక్ చేస్తూ ఏర్పాటు చేయడం.. కేన్సర్ నిర్ధారణకు మామోగ్రాఫ్ మిషన్ ద్వారా స్కాన్ చేయాల్సి ఉండడంతో ఎక్స్‌రేలు 50 వరకు మాత్రమే తీస్తుంటారు. కానీ జనరల్ ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ పాడవటంతో వైద్యులు హబ్‌కు పంపిస్తుండగా ఈ యంత్రంపై భారం పడి తరచూ మొరాయిస్తోంది. ఇద్దరు, ముగ్గురికి ఎక్స్‌రేలు తీయగానే మొరాయిస్తుండటంతో అర గంట పాటు సేవలు నిలిపివేయాల్సి వస్తోంది. అంతేకాక మామోగ్రఫీ సేవలకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గంటల తరబడి వేచి ఉండలేక చాలామంది బయటకు వెళ్లి ఎక్స్‌రే తీయించుకొస్తున్నారు. ఈవిషయమై అధికారులు స్పందించి పెద్దాస్పత్రిలో ఎక్స్‌రే యంత్రాన్ని మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. కాగా, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ వివరణ కోరగా ఎక్స్‌రే యంత్రం సమస్యను టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులకు తెలిపామని చెప్పారు. అయితే, గతంలో మరమ్మతు చేసిన కంపెనీ బాధ్యులకు డబ్బు బకాయి ఉండడంతో వారు రావటానికి ఆలస్యమవుతోందని తెలిపారు. ఇప్పటికే కంపెనీ ప్రతినిధులతో మాట్లాడగా త్వరలోనే వస్తామని చెప్పారని వివరించారు.

విద్యార్థినుల చదువుకు భరోసా

కలెక్టర్ ఆదేశాలతో వివరాలు ఆరాతీసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


మానస వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి: తల్లి కోసం ఒకరు... అనారోగ్యంతో ఒకరు చదువు మానేసి ఇంటి వద్ద ఉన్న అంశం ఇటీవల కుటుంబ సర్వే సందర్భంగా బయటపడగా, ఈ అంశంపై 'చదువుకోవాలని ఉంది' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పూర్తి వివరాలు తెలుసుకుని ఆదేశించడంతో డీఈఓ సూచనల మేరకు ఎంఈఓ బి.చలపతిరావు శుక్రవారం మండలంలోని కట్టుకాచారం వచ్చారు. ఈ సందర్భంగా చేకూరి నవ్యశ్రీ పాఠశాలకు వెళ్లేందుకు సైకిల్ సమకూర్చడమే కాక తల్లి చికిత్సకు ఆర్థిక సాయం అందిస్తామని, బి.మానసకు ట్రై సైకిల్ ఇవ్వడమే కాక పాఠశాలకు వెళ్లలేకపోతే ఆన్‌లైన్‌లో పాఠాలు వినేలా ల్యాప్‌టాప్ సమకూరుస్తామని తెలిపారు. కాగా, పూర్తిస్థాయిలో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఎంఈఓ తెలిపారు. అలాగే, ఆయన సొంతంగా ఇద్దరు విద్యార్థినిలకు ఆర్థిక సాయం అందించారు. ఉపాధ్యాయుడు ఇటిక్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 20నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 20నుంచి 22వరకు ఖమ్మంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్.మూర్తి, టి.నాగరాజు తెలిపారు. ఖమ్మంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం మహాసభల లోగోను ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, బాధ్యులు ఐ.వీ.రమణ, ఎం.వీరారెడ్డి, ఎం.సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మువ్వా శ్రీనివాసరావు, వీరారెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ మహాసభలు ఖమ్మం నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎల్.మూర్తి, టి.నాగరాజు, సుధాకర్, ప్రవీణ్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో రాష్ట్ర 14వ మహాసభలు ఖమ్మంలో జరగగా, మళ్లీ 25ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి ఖమ్మం ఆతిథ్యం ఇస్తున్నందున మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రజనీకాంత్, డి.కిరణ్, బెజవాడ సాయిశేషు, రాగిణి, వంకాయల రాజు, మనోజ్, త్రినాథ్, సింధు, శ్రావ్య, నిత్య తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు, నిర్బంధాలతో గొంతు నొక్కుతున్నారు..

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన మాజీ ఎమ్మెల్యే సండ్ర తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్ పార్టీని నమ్మి అధికారం అప్పగిస్తే.. ఇందిరమ్మ రాజ్యం పేరిట ఎమర్జెన్సీని తలపించేలా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ విమర్శించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్న తమ పార్టీ నేతల గొంతు నొక్కుతున్నారని చెప్పారు. అక్రమ కేసులు, నిర్బంధాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదని, ఉద్యమంలో ఇలాంటివన్నీ ఎదుర్కొన్నాకే కేసీఆర్ సారథ్యాన తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. కాగా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం గర్హనీయమన్నారు. తొలుత అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ నగర, రూరల్ అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్‌తో పాటు నాయకులు శీలంశెట్టి వీరభద్రం, గుండ్లపల్లి శేషగిరిరావు, పగడాల నరేందర్, సుబ్బారావు, లింగబోయిన సతీష్, ఉమామహేశ్వర్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీకొట్టిన ట్రాక్టర్

కామేపల్లి: ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ వెనక నుంచి ఢీకొట్టిన ఘటన మండలంలోని కామేపల్లి క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బస్సు కామేపల్లి క్రాస్ వద్ద ప్రయాణికుల కోసం ఆగింది. అదే సమయాన బాసిత్‌నగర్ గ్రామపంచాయతీ ట్రాక్టర్ వెళ్తూ అదుపుతప్పగా బస్సును వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోగా కుదుపుతో ఏం జరిగిందోనని ప్రయాణికులు ఆందోళన చెందారు. ఈఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

భార్యపై రోకలిబండతో దాడి

చింతకాని: మండలంలోని నాగులవంచకు దుగ్యాల ఉప్పలయ్య తన భార్యపై రోకలిబండతో దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలైనాయి. ఐదేళ్ల క్రితం రోజారాణి వివాహం చేసుకున్న ఉప్పలయ్య కొన్నాళ్లు బాగానే ఉన్నా ఆతర్వాత నిత్యం మద్యం తాగొచ్చి గొడవ పడేవాడు. గురువారం కూడా తాగి రావడంతో ప్రశ్నించిన రోజారాణిపై రోకలిబండతో దాడి చేయడంతో తల, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. దీంతో బాధితురాలి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మహిళపై కొడుకు, కోడలు..

వేంసూరు: ఆస్తి వివాదం నేపథ్యాన ఓ మహిళపై ఆమె కొడుకు, కోడలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వేంసూరు మండలం మర్లపాడుకు చెందిన దాన్నె నాగమ్మ తమ భూమిని ముగ్గురు కుమార్తెలకు రాసి ఇచ్చింది. దీంతో ఆగ్రహించిన ఆమె కుమారుడు దాన్నె భాస్కర్ – లక్ష్మి శుక్రవారం దాడి చేయగా తీవ్రంగా గాయపడిన నాగమ్మను సత్తుపల్లి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితురాలి కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

రెండు మట్టి టిప్పర్లు సీజ్

ఏన్కూరు: సామర్థ్యానికి మించి మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు సీజ్ చేశారు. మండల పరిధిలోని గార్లఒడ్డులో శుక్రవారం రవాణా శాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా గార్లఒడ్డు గుట్టల నుండి వైరా ప్రాంతానికి మట్టి తరలిస్తున్న టిప్పర్లను పరిశీలించగా సామర్థ్యానికి మించి లోడ్ ఉండడంతో రెండు వాహనాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

బాలపేట వద్ద...

ఖమ్మంఅర్బన్: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. బాలపేటకు చెందిన శ్రీను టిప్పర్‌లో బాలపేట గుట్టల వద్ద మట్టి లోడు చేసుకొస్తుండా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యజమానితో పాటు డ్రైవర్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కరిగిపోయిన కన్నీళ్ల నడుమ అంత్యక్రియలు

అమెరికా నుంచి ఖమ్మం చేరిన సాయితేజ మృతదేహం


సాయితేజ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ తదితరులు

ఖమ్మంక్రైం: అమెరికాలో గత శనివారం దుండగులు జరిపిన కాల్పుల్లో హతమైన ఖమ్మంకు చెందిన నూకారపు సాయితేజ మృతదేహం శుక్రవారం ఇక్కడకు చేరింది. అమెరికా నుంచి హైదరాబాద్‌కు విమానంలో, అక్కడి నుంచి ఖమ్మం రాపర్తినగర్ రమణగుట్ట ప్రాంతంలోని నివాసానికి అంబులెన్స్‌లో తీసుకురాగా తలిదండ్రులు వాణి – కోటేశ్వరరావు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎంబీఏ చేయడానికి ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లిన సాయితేజ చికాగో ప్రాంతంలో ఓ స్టోర్‌లో పనిచేస్తుండగా ముసుగులు ధరించి వచ్చిన దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన విషయం విదితయే. జిల్లా ప్రజాప్రతినిధులు, తానా బాధ్యుల చొరవతో మృతదేహాన్ని తీసుకురాగా అక్కడే ఉంటున్న సాయితేజ సోదరి ప్రియ కూడా వెంట వచ్చారు. వారం రోజులుగా కుమారుడి మృతదేహం కోసం చూస్తున్న సాయితేజ తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ స్వగ్రామమైన ఖమ్మం రూరల్ మండలం రామన్నపేటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునకొల్లు నీరజ, కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రంతో పాటు తుమ్మల యుగంధర్ తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌డీ నాయకుడు మధు

తిరుమలాయపాలెం: ములుగు జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. మండలంలోని దమ్మాయిగూడెంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఏడుగురు మావోయిస్టులను పట్టుకొచ్చిన పోలీసులు ఏకపక్షంగా హతమార్చి, ఎదురుకాల్పులుగా చెప్పడం సరికాదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇచ్చిన పిలుపులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీతో చీకటి ఒప్పందం కుదుర్చుకుని పనిచేస్తోందని ఆరోపించారు. అలాగే, దేశంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వాన మత విద్వేషాలను రెచ్చగొడుతూ మైనార్టీలను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాగా, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పేందుకు తీసుకొచ్చిన నల్లచట్టాలను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్‌డీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, నాయకులు గొర్రెపాటి రమేష్, అచ్చ ఉప్పలయ్య, పోలెపొంగు నాగయ్య, బ్రహ్మచారి, పట్టాభి, వెంకటేశ్వర్లు,షబ్బీర్, శుభహన్, శ్రీకాంత్, లక్ష్మణ్, మల్సూర్, పెంటయ్య పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాల పంట

తల్లాడ: ఆయిల్‌పామ్ సాగు ద్వారా లాభాలు సాధించొచ్చనే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య సూచించారు. తల్లాడ మండలం మల్లవరం రైతు వేదికలో శుక్రవారం ఏఓ, ఏఈఓలతో సమావేశమైన ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకొచ్చే రైతులకు ప్రభుత్వం మొక్కలు అందజేస్తుందని, పంట చేతికొచ్చే వరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చనే అంశంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకునేలా సమీక్షించాలని చెప్పారు. అంతేకాక ధాన్యం, పత్తి కొనుగోళ్లపై డీఏఓ సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి ఎం.డీ.తాజుద్దీన్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

చోరీల కేసులో నిందితుడు అరెస్టు

రూ.8.68లక్షల సొత్తు స్వాధీనం


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రెహమాన్

మధిర: మధిర పట్టణంతో పాటు మండలంలోని మడుపల్లి, ఆత్కూరు తదితర గ్రామాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు వైరా ఏసీపీ రెహమాన్ వెల్లడించారు. మధిర సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మడుపల్లికి చెందిన బండి గోపి కారు డ్రైవర్‌గా పనిచేస్తూనే డీజే సౌండ్ సిస్టమ్ నిర్వహిస్తున్నాడు. అయితే, సులువుగా డబ్బు సంపాదించేలా మధిర పట్టణం, పరిసర గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈక్రమాన మధిర టౌన్ ఎస్ఐ-2 ఎస్. చంద్రశేఖర్ ఆత్కూరు క్రాస్ వద్ద తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో వెంబడించి పట్టుకుని విచారించగా బండి గోపిగా తేలింది. ఆయన మధిర సుందరయ్య నగర్, లడక బజార్, మడుపల్లి, ఆత్కూరు, ఏపీలోనిఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని పెనుగొలను, వత్సవాయిల్లో 9 చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు నిందితుడి నుంచి రూ.8.68లక్షల విలువైన 15 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదు, రెండు కెమెరాలు, సీసీ టీవీ డీవీఆర్ స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంతో సొత్తు రికవరీచేసిన పోలీస్ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మధిర సీఐ డి.మధు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పిల్లికి సీమంతం !


అలంకరణలో పిల్లి (సాషా)

మధిర: మధిరలోని సీపీఎస్ రోడ్డులో నివసిస్తున్న అల్లూరి నాగభిక్షం – పద్మ దంపతుల ఆధ్వర్యాన శుక్రవారం పిల్లికి సీమంతం నిర్వహించారు. నాగభిక్షం ఇంట్లో ఆర్టీసీ మధిర డిపో కండక్టర్ అబ్బాస్ కుటుంబం అద్దెకు ఉంటోంది. వీరి పెంచుకుంటున్న పిల్లి నాగభిక్షం దంపతులకు మచ్చిక అయింది. సాషా పేరిట పెంచుకుతున్న పిల్లి ప్రస్తుతం గర్భంతో ఉండగా నాగభిక్షం – పద్మ ఆధ్వర్యాన బంధుమిత్రులను ఆహ్వానించి సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లిని గాజులు, గొలుసులు, పూలదండ, డ్రెస్‌తో అలంకరించి వడి నింపే కార్యక్రమాలన్నీ నిర్వహించారు.

ఆర్టీసీ బస్సులో వస్తుండగా చోరీ

మధిర: మధిరకు చెందిన పసుమర్తి శ్రీనివాసరావు సతీమణి విజయలక్ష్మి వద్ద బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆమె ఓ ఫంక్షన్‌కు హాజరై శుక్రవారం వైరా నుంచి ఆర్టీసీ బస్సులో మధిరకు వస్తున్నారు. బ్యాగ్‌లో బంగారు వడ్డాణం, నగలు ఉండగా, ఆమె పక్కన కూర్చున్నవారు చోరీ చేసినట్లు తెలిసింది. కాసేపటికి బ్యాగ్‌లో చూసుకోగా ఆభరణాలు లేకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని మధిర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బోనకల్‌లో...

బోనకల్: మండల కేంద్రంలోని మల్లెల నాగేశ్వరావు ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గుర్తించిన దుండగులు తలుపులు పగలగొట్టి రూ.30వేల విలువైన టీవీ, రూ.20వేలు విలువైన వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అలాగే, మండలంలోని చిరునోములలో బొడెపూడి స్వరూపారాణి ఇంటి తలుపులు ధ్వంసం చేసి రూ.75వేలు నగదు, రూ.25విలువైన వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేశారు.

మైనర్‌పై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించడమే కాక బాధితురాలికి రూ.3లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తీర్పు వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం మోటాపురానికి చెందిన బానోత్ దీప్లా 2021 ఆగస్టు 25న సమీపంలో నివాసముండే బాలికను తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనపై బాలిక తల్లి నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం దీప్లాపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానాతో పాటు బాధితురాలికి పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా ఎస్సై రషీద్, ఉద్యోగులు మందా రామారావు, చిట్టిబాబు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు సహకరించారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఓ కారు బోల్తా పడింది. ఈ కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సూర్యాపేట నుండి ఖమ్మం వైపు వెళ్తున్న కారు మండలంలోని గోపాలరావుపేట పరిధిలోకి రాగానే ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. దీంతో రహదారి మధ్య మొక్కలు నాటిన ప్రదేశంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడగా, వారి వివరాలు తెలియరాలేదు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెనుబల్లి: మండలంలోని టేకులపల్లిలో రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివిధ గ్రామాల్లో పేదల వద్ద కొనుగోలు చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వాసి రామారావుకు విక్రయించేందుకు మిట్టపల్లి శేషగిరిరావు ఓ ఖాళీ ఇంట్లో నిల్వ చేశాడు. ఈమేరకు తనిఖీ చేపట్టిన బియ్యం స్వాధీనం చేసుకోగా, శేషగిరిరావుపై కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లకు చెందిన బైర్ల బాలాజీ(62) ఈనెల 3న వీఎం బంజర్ నుండి ద్విచక్రవాహనంపై కుప్పెనకుంట్లకు వెళ్తుండగా బయ్యన్నగూడెం వద్ద హైవేపై బారికేడ్లు తాకడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈమేరకు బాలాజీ కుమారుడు వెంకటనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

బోనకల్: బోనకల్‌కు చెందిన ఆటో డ్రైవర్ మరీదు అంజయ్య(55) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆళ్లపాడుకు చెందిన ఆయన కొన్నేళ్ల క్రితం బోనకల్ వచ్చి స్థిరపడ్డాడు. ఆటో నడిపితే ఆదాయం సరిపోగా కుటుంబ పోషణ భారంగా మారడంతో ఇంటిని తనఖా పెట్టడమే కాక బంగారు ఆభరణాలు తనఖా పెట్టిన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులో రుణం తీసుకున్నాడు. కొన్నాళ్లుగా వడ్డీ చెల్లిస్తున్నా పూర్తిగా తీర్చే మార్గం లేకపోవడంతో అంజయ్య గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాగా, అంజయ్యకు భార్యతో పాటు ఓ కుమార్తె ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

ఖమ్మంరూరల్: జీవితంపై విరక్తి చెందిన ఖమ్మంకు చెందిన వి.శ్రీనివాసరావు (54) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్న ఆయనకు నష్టం రావడం, ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో ఈనెల 5న మండలంలోని పల్లెగూడెం ఎన్నెస్పీ కాల్వ వద్ద పురుగుల మందు తాగాడు. దీంతో స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈమేరకు ఆయయన భార్య కవిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.